క్లుప్తంగా

అంకాళమ్మ పరమేశ్వరి సేవలో ఎంపీ గురుమూర్తి


అంకాళమ్మ పరమేశ్వరిని దర్శించుకుంటున్న ఎంపీ గురుమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు గ్రామ దేవత అంకాళమ్మ పరమేశ్వరిని శనివారం తిరుపతి ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్యవేడు: శ్రీసిటీలోని చెరివి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జగదీష్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీసిటీలో కంపెనీలు, ఇరుగుళం, మాధవపాళెం, రాళ్లకుప్పం, ఆరూరు, వానెల్లూరు, చెరివి, చెంగంబాకం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో ఉన్న అంకాళమ్మ ఆలయం వద్ద శనివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రీబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు


ముళ్లపొదలను తొలగిస్తున్న జేసీబీ

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో శనివారం సర్పంచ్ తాతేకాల్వ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుకిరువైపుల ముళ్ల పొదలను తొలగించారు. రైల్వే గేటు నుంచి పోతుమానిగుంట ఎస్టీ కాలనీ వరకు రోడ్డుకిరువైపుల దట్టంగా ముళ్లపొదలు పెరగడంతో ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు, గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. సమస్యను సర్పంచ్‌కు విన్నవించడంతో జేసీబీతో రోడ్డుకిరువైపుల ఉన్న ముళ్ల పొదలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

పాఠశాలల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న శివ శంకరయ్య

నాగలాపురం: సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య శనివారం సురుటుపల్లి, చిన్నాపట్టు పాఠశాలలను తనిఖీ చేశారు. ముందుగా నాగలాపురం ఎమ్మార్సీలో ఎంఈఓలు బాబయ్య, జనార్ధనరాజు, ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని 90 రోజులు నిర్వహించాలన్నారు. అలాగే పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు చేరే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆ వివరాలను దీక్షయాప్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, సీఆర్పీ శివయ్య పాల్గొన్నారు.

వైభవంగా హోమ పూజలు

నగరి: మున్సిపల్ పరిధిలోని పుదుపేట నాగాలమ్మ ఆలయంలో శనివారం కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా హోమపూజలు వైభవంగా నిర్వహించారు. పండితులు శ్రీనివాస అయ్యర్ ఉదయం గణపతిపూజ, స్వస్తివాచనం పూజలు నిర్వహించారు. సాయంత్రం వాస్తు పూజ, కలశస్థాపన పూజ, అగ్ని ప్రదక్షిణ, లఘు పూర్ణాహుతి పూజలు చేపట్టారు. రాత్రి నూతన విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆదివారం మహా కుంభాభిషేకం, మహా అభిషేకం, ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక బహిరంగసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఫారెస్టు, వెటర్నరీ, స్కూల్ ఎడ్యుకేషన్, వెలుగు, సెర్ప్, శాఖల ద్వారా ఉపాధి నిధులతో పనులను చేపట్టినట్లు తెలిపారు. 2023–2024లో 725 పనులకు రూ.6,39,66,735లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఆ పనులపై 15 మంది డీఆర్పీలు మండలంలో వారం రోజులు తనిఖీలు చేపట్టారని తెలిపారు. పలు గ్రామాల్లో చెరువుల్లో తవ్విన గుంతల కొలతలను ఎంబుక్‌లో రికార్డు చేయడంలో తేడా వచ్చినట్టు గుర్తించి రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, ఏఈఓ గణేష్, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఏపీఓ భానుప్రియ, ఎస్ఆర్‌పీ వెంకయ్య పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అంబుడ్స్‌మెన్ రసరాయనాయుడు తెలిపారు. వేసవిలో కూలీలకు వ్యవసాయ పనులు ఉండవని, అందుచే ప్రతి కూలీకి పనిని చూపించాలని, పండ్ల తోటల పెంపకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యంత్రాలతో పనులు చేయకుండా చూడాలని తెలిపారు.

దుకాణాలపై దాడులు


ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేక తనిఖీ బృందం సభ్యులు

ఏర్పేడు: మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ శాఖాధికారులు దాడులు చేశారు. వ్యవసాయశాఖ జిల్లాధికారి ప్రసాదరావు, ఏడీఏపీపీ ధనుంజయరెడ్డి, ప్రత్యేక తనిఖీ బృందం సభ్యులు ఎన్పీ ఎల్లప్ప, జీవానందం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. బయోమెట్రిక్ విధానంలో అమ్మకాలు జరగని రూ.28,63,18 విలువ చేసే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను విక్రయించకుండా సీజ్ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను బయోమెట్రిక్ పద్ధతిలో వేలిముద్రలను సేకరించి విక్రయించాలన్నారు. అమ్మకాలు జరిగిన వాటికి రైతులకు రసీదులు అందజేయాలని చెప్పారు. సీజ్ చేసిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మళ్లీ ఉత్తర్వులు వచ్చేంత వరకు ఆపాలని దుకాణాల యజమానులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి షణ్ముగం పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం


విశేషాలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరాలయంలో ఉన్న శనీశ్వరస్వామివారికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద దళితవాడ శ్మశానానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్ రాజు శనివారం తెలిపారు. దళితులు శ్మశానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన బోనాసి సుబ్రమణ్యం శుక్రవారం మృతి చెందడంతో మృతదేహాన్ని పంట పొలాల్లో గట్లపై మోసుకుని శ్మశానంలోకి చేరుకున్నారు. శనివారం సాక్షి దినపత్రికలో 'చచ్చినా చావే' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అలాగే సమస్యపై పలు దినపత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. వెంటనే స్పందించిన తహసీల్దార్ శ్మశానానికి రోడ్డు నిర్మించడానికి ప్రతిపాదనలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే శ్మశానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

కల్యాణ వెంకన్నకు ఊంజల్ సేవ


ఉభయ నాంచారులతో కల్యాణ వేంకటేశ్వరుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవ కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కైంకర్యాలు పూర్తయిన తర్వాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. గంట పాటు నిర్వహించిన ఊంజల్ సేవలో ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


విశేషాలంకరణలో వారాహి అమ్మవారు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ఉన్న సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం వారాహి అమ్మవారి ఆషాడ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం సందర్భంగా 15వ తేదీ వరకు వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయాధికారులు తెలిపారు. పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కార్య నిర్వాహక అధికారి కె.రామచంద్రారెడ్డి స్వాగతం పలికి, దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కార్తికేయన్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


మొక్క నాటుతున్న స్కాట్ విద్యార్థులు

శ్రీకాళహస్తి: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని సరస్వతీబాయ్ పురపాలక సంఘం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్కాట్ మాస్టర్లు అజారుద్దీన్, ధనుష్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

బోటనీ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ (వృక్ష శాస్త్రం) లెక్చరర్ పోస్టుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. కాంట్రాక్ట్ పద్ధతిపై పోస్టును భర్తీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి 10వ తేదీ సాయంత్రానికి అర్హత కలిగిన వారి పేర్లను నోటీసు బోర్డులో ఉంచుతామన్నారు. అనంతరం 11వ తేదీ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి దివాకర్ అన్నారు. మండలంలోని వేణుగోపాలపురం గిరిజన కాలనీలో శనివారం వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పర్యటించారు. గిరిజనులకు డయేరియాతోపాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కలుషితమైన నీటిని తాగడం, కలుషిత ఆహార పదార్థాలు తినడంతో టైఫాయిడ్, డయేరియా వస్తాయన్నారు. దోమల కాటుతో మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.

స్టార్టర్ల చోరీ


గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టిన స్టార్టర్లను చూపుతున్న రైతులు

ఏర్పేడు: మండలంలోని మోదుగులపాళెం పొలాల్లో గురువారం రాత్రి విద్యుత్ మోటార్ల స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు రాత్రి వేళలో పొలాల్లోని మోటార్ల వద్దకు వెళ్లడం లేదు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి మోదుగులపాళెం పొలాల్లోని సుమారు 18 మంది రైతుల స్టార్టర్లను అపహరించి పగులగొట్టి అందులోని విలువైన కాపర్‌ను తీసుకుని వెళ్లారు. శనివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పగులగొట్టిన స్టార్టర్లను గుర్తించి, ఎస్పీడీసీఎల్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

శ్రీకాళహస్తి: పట్టణంలోని పాతబస్టాండ్ కూడలి వద్ద శనివారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేశాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, వేడం కృష్ణయ్య, రమణ, చాగణం శైలజ, ఉమాసింగ్, కొండేటి గోపాల్, మద్దు వాసుయాదవ్, ఢిల్లీకుమార్, బాలాజీనాయుడు, కందాటి మునిరాజా, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వరదయ్యపాళెం: మండలంలోని వెంకటేశ్వర గిరిజనకాలనీలో రెండు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన బుజ్జమ్మ కుటుంబాన్ని టీడీపీ, జనసేన నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. రూ.7 వేలు నగదు, సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు యాదవ్, ప్రతాప్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తడ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శిరీషా, శేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భక్తిభావం పెంచుకోవాలి


వెంకటేశ్వరనామం రాసిన విద్యార్థులు

శ్రీకాళహస్తి: విద్యార్థులు భక్తి భావం పెంచుకోవాలని టీటీడీ ధర్మప్రచార పరిషత్ ప్రతినిధులు సూచించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ వద్ద విద్యాజ్యోతి పబ్లిక్ హైస్కూల్‌లో శనివారం టీటీడీ హిందూ ధర్మరప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వేంకటేశ్వరనామావళి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వేంకటేశ్వర నామాన్ని 108 సార్లు రాశారు. అనంతరం వెంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై పరాశరేశ్వరస్వామి విహారం


సింహ వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లి సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారు సింహ వాహనంపై విహరించారు. ఉదయం అర్చకులు నిత్యపూజలు చేసిన అనంతరం పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. 10 గంటలకు చంపకవల్లి సమేత పరాశరేశ్వర స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవర్లు సింహ వాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న అనంతరం గ్రా మంలో ఊరేగారు. టీటీడీ స్థానిక ఆలయ ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం సాయంత్రం స్వామి వారు హంస వాహనంపై ఊరేగుతారని అర్చకులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ నేత్రాలయ డాక్టర్లు


వైద్యశిబిరానికి హాజరైన రోగులు

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని శ్రీవేంకటేశ్వర 24 గంటల ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు అరవింద్, మునివేలు రోగులకు కంటి పరీక్షలు చేసినట్టు డాక్టర్ రాజద్రన్ తెలిపారు. 143 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి 48 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వారిని చెన్నైకి తీసుకెళ్లి చికిత్స చేయిస్తామన్నారు. శ్రీ వేంకటేశ్వర వైద్యశాల ప్రాంగణంలో ప్రతి సంవత్సరం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి, పేదలకు కంటి ఆపరేషన్లు చేయించి అద్దాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాము, సామాజిక కార్యకర్త కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు


షాపులో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్

రేణిగుంట: నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్మితే కఠిన చర్యలు తప్పవని రేణిగుంట ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. రేణిగుంటలోని పలు దుకాణాల్లో శనివారం ఆయన తనిఖీలు చేపట్టారు. గుట్కా, ఖైనీ, హాన్స్ తదితర నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. దుకాణ యజమానులను స్టేషన్‌కు పిలిపించి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువత చెడు మార్గంలో వెళ్లేందుకు ఇవి దోహదం చేస్తున్నాయన్నారు. అలాగే రేణిగుంటలోని రమణ విలాస్ కూడలి, చేపల మార్కెట్ సమీపంలో వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించి, బైక్‌లు నడపాలని కోరారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న పశుసంవర్ధక శాఖ డీడీ, ఏడీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో జూనోసిస్ వ్యాధులపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం 48 పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేశారు. ఆ తరువాత లూయిస్ పాశ్చర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి డివిజన్ పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.ఉమామహేశ్వరి మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత పశుసంవర్థకశాఖ సిబ్బందిపై ఉందన్నారు. సహాయ సంచాలకులు శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ పెంపుడు కుక్కలు, పిల్లులు, పశువుల యజమానులు సకాలంలో వాటికి టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు శరత్, రవీంద్రవర్మ, ఉష, అరుణ్‌కుమార్, ఏడీ స్వామి బాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు మనమిచ్చే ఆస్తి విద్యే


పిల్లలకు ఉపకరణాలు అందజేస్తున్న ఆదిమూలం

నారాయణవనం: పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి విద్య మాత్రమేనని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. కైలాసనాథ కోనలోని శివశక్తి ఆశ్రమ నిర్వాహకులు శనివారం చెన్నైకి చెందిన శ్రీ దేవీనాథ మిషన్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు బ్యాగు, నోటు పుస్తకాలు, ప్లేట్లు, వాటర్ బాటిళ్ల అందజేశారు. గోవిందప్పనాయుడుకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శివశక్తి, శ్రీ దేవీ నాథ మిషన్‌ను స్ఫూర్తిగా తీసుకుని దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శివశక్తి ఆశ్రమ ట్రస్టీ శ్రీకుమార్ మాట్లాడుతూ పేద పిల్లలకు విద్యా ఉపకరణాలను అందించడం మాధవ సేవగా భావిస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నారాయణవనం, కేవీబీపురం మండలాల్లోని 24 గ్రామాల్లో 25 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,350 మంది పిల్లలకు విద్యా ఉపకరణాలు అందజేసినట్టు తెలిపారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎంఈవో ప్రభాకర్‌రాజు, ట్రస్టీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

శ్రీకాళహస్తి రూరల్: రైతులకు కల్తీ విత్తనాలు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. శ్రీ కాళహస్తి మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని తెలిపారు. ఈ దాడులలో కళ్యాణ్ దుర్గం ఏడీఏ కాళప్ప, తిరుపతి జిల్లా ఏడీఏ(పీపీ) ధనంజయ రెడ్డి, విజిలెన్స్ ఎస్‌ఐ జీవ, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు ఎమ్మెల్యేగా ఓడి గెలిచాను


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: టీడీపీ పార్టీ నాయకుల సహకారం కొరవడడంతో తాను ఓడి గెలిచినట్టు అయిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన శనివారం నారాయణవనం మండలం గోవిందప్పనాయుడు కండ్రిగలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలెన్, జేడీ రాజశేఖర్ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నియోజకవర్గంలో అందరూ కలిసి పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని చంద్రబాబే స్వయంగా చెప్పినా పెడచెవిన పెట్టారని దుయ్యబట్టారు. ఐపీఎల్ ఫైనల్‌లో ఓడిపోతుందనుకున్న టీమ్ ఇండియా అనూహ్యంగా చివరి రెండు ఓవర్లలో గెలిచినట్లు, తానూ ఎన్నికల్లో ఓడి గెలిచానని అన్నారు. 16వ రౌండు వరకు ఓటమి తప్పదనుకున్న తనకు చివరి నాలుగు రౌండ్లలో మెజారిటీ వచ్చిందని వివరించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి కలిసి రావాలని ఆయన హితవు పలికారు.